# మోడ్రన్ ఆర్ట్

ఇప్పటికి ఆరు సిగరెట్లు అయిపోయాయి.

అయినా నేను ఓ నిర్ణయానికంటూ రాలేకపోతున్నాను. అదంత సులభంకాదని నాకు తెలుసు. నిన్న రవీంద్రజైన్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు నన్నూ ఆహ్వానించాడు. విశాలమైన ఆ హాల్లో నలుమూలలా వాటిని అలంకరించటంలో నిస్సందేహంగా ఓ ప్రత్యేకత ఉంది.

నిర్మొహమాటంగా చెప్పాలంటే అవేవీ నాకు అర్థం కాలేదు. నాకు అర్థం కానంత మాత్రాన వాటిని తిరస్కరించే మానసికస్థితిలో నేనులేను. నన్నుఆశ్చర్యానికి లోనుచేసింది అదికాదు. రవీంద్రజైన్ 'ఆర్ట్'ను ప్రశంసించడంలో చాలా మంది పోటీలు పడ్డారు. వారందరికీ అంత కళాత్మక దృష్టి ఉందని నేననుకోవడం లేదు.

ఇదంతా నాది కళాత్మక హృదయం అని చెప్పుకునే ప్రయత్నంకాదు. ఇటీవలికాలంలో నాలో స్పష్టంగా ఓమార్పు వచ్చింది.

'విషయంలోనైనా చివరిమాట అంటూ లేదు. ఏ సత్యమైనా ఈనాటిదే. రేపు అదీ అలానే ఉంటుందనే నమ్మకంలేదు'

ఇలాంటి భావాల్ని నేను ఆమోదించాక, ఒక విషయం మీద అభిప్రాయం చెప్పడానికి సంశయించాల్సింవస్తూంది. అయినాసరే కొన్ని అభిప్రాయాలు చెప్పకుండా ఉండటం సాధ్యంకాదు. అంతిమ సత్యం లేదు

కాబట్టి, సత్యం ఎప్పటికప్పుడు తాత్కాలికం కాబట్టి ఈలోగా మన భావాల్ని సైతం దాచుకోలేం, అని తప్పయినా!

అందుకే రవీంద్రజైన్ చిత్రాలను ప్రశంసించే వారూ, మంచి ధరకు ఖరీదు చేసేవారూ, అందరూ ఆ ఆర్ట్‌లోని విలువల్ని గ్రహించి– అని మాత్రం నేనను కోవడం లేదు. కొద్ది మందికి నిజంగానే ఆ ఆర్ట్‌లోని గొప్పతనం అర్థమై ఉంటుంది. నా కలాంటిస్థాయి లేకపోవడం, ఆ స్థాయికి ఎదగాల్సి ఉండటంకూడా వాస్తవమే.

ఎంత ప్రయత్నం చేసినా ఆ చిత్రాల్లో నాకు పరిచయమైనదిగానీ, కనీసం నా ఊహాప్రపంచం గానీ కనిపించటంలేదు. అవేమీ నన్ను ఆకర్షించడం లేదు. నేను ఇలాంటి ఎగ్జిబిషన్స్‌కు వెంది, చాలా కార్టూన్స్ చూశాను. అవన్నీ ఒక్క ముక్కలో ఈ ఆర్ట్‌ను హేళనచేశాయి. కార్టూనిస్ట్‌కి ఆ మాత్రం స్వేచ్ఛ ఉంటుందేమో నాకయితే తెలియదు. కానీ నేను ఈ ఆర్ట్‌ను, తిరస్కరించలేక పోతున్నాను. ఎందుకని తిరస్కరించలేక పోతున్నానో ఇప్పుడు చెప్పలేను.

రవీంద్రజైన్ తన చిత్రాల గురించి అడిగినప్పుడు, 'అద్భుతం' అనలేకపోయాను. అలాగని నాకు 'అర్థంకాలేదు' అని చెప్పడానికి ఏదో అడ్డంవచ్చింది. పూర్తిగా అర్థం కాలేదని చెప్పడానికి కూడా లేదు. అందులో రంగులూ, రేఖలూ నాకు పరిచయమే. అవే ఆర్ట్ ఎలాకావో, అవి లేకుండానూ ఆర్ట్ లేదు. ఆ చిత్రాలులేవు. అందుకే చిన్నగా నవ్వడం మించి ఏమీ చేయలేకపోయాను. మనిషిలో ఒక రకమైన 'అహం' ఉంటుందని నేను అంగీకరిస్తాను. తన 'మోడ్రన్ ఆర్ట్' బాగుంటుందని కృత్రిమంగా ఎలా చెప్పలేకపోయానో, నాకుఅర్థం కాలేదనే విషయమూ చెప్పలేదు. అసలు నాకెందుకు అర్థంకావడం లేదనే భావం నన్ను పీడిస్తూంది. నేను కళలకుచెందిన, అలాగే ఈ రకమైన ఆర్ట్‌కు చెందిన, నియమాల గురించి

తెలుసుకోలేదు. నేనుకొద్దిగా కవిత్వం చదివాను. మన ప్రముఖ రచయితల్లో కొందరి రచనలు మాత్రమే చదవగలిగాను. అయితే 'ఆర్ట్'ను అనుభవించ డానికి తెలియకపోవడం అనేది అడ్డురాలేదు.

ప్రకృతిచిత్రాలు, గ్రామీణ జీవితం, సంప్రదాయాల్ని ప్రతిబింబించే చిత్రాలు, కమర్షియల్ ఆర్ట్, ఇలా అనేక చిత్రాలు చూసి నేను అనుభూతి చెందాను. కొన్ని నన్ను ఆశ్చర్య పరిచాయి. మరికొన్ని ఆలోచింపచేశాయి. వాటిలో కనిపించింది. ఓ రకమైన ఆత్మీయత, జ్ఞాపకం, కదిలిక.... వాటిలో నేనూ గమనించాను. అయితే ఇలాంటి చిత్రాల్లోనూ నేను ఆమోదించని అంశాలున్నాయి. అది వేరే విషయం. కాగా ఈ 'మోడ్రన్ ఆర్ట్' నాకు అర్థంకాక పోగా ఓ రకమైన 'ఇన్‌ఫీరియారిటీ' కాంప్లెక్స్‌కు గురిచేసింది.

నిజమే. మొదట్లోఏదీ అర్థం కాదు. వాటిలోతుల కెళితేగాని ఏదీ అర్థం కాదు. వాస్తవమే. మోడ్రన్ఆర్ట్ అనేది ఆర్ట్‌కుచెందిన ఓ ప్రక్రియ మాత్రమే. కానీ ప్రత్యేకమైనది కాదు. అది ఆర్టులో అంతర్భాగమే. మరి ఈ ఆర్టులో 'గుట్టు' ఎందుకు లేదనిపిస్తుంది? కొద్దో గొప్పో చదువుకున్న, కళ పట్ల ఉత్సాహమున్న, నన్ను సైతం ఆకర్షించనితనం ఎందుకుంది? ఇది కేవలం అర్థం కాకపోనడమేనా?

మరో రెండు సిగరెట్లు ఖర్చయిపోయాయి. ఈ భావం తప్పుకావచ్చు గాని నేనోవిషయం ఇప్పుడు చెప్పగలుగుతున్నాను. 'మోడ్రన్ ఆర్టు' నన్ను ఆకర్షించకపోడానికి కారణం అర్థంకాకపోవటమే కాదు. మరెందువల్ల? ఏ కారణం... ఏ కారణాలు... దీని వెనుక ఉన్నాయి!

సిగరెట్లు ఖర్చయిపోతున్నాయి.

కొన్ని చిత్రాలు ఎందుకు అర్థమౌతున్నాయి? అసలు వాటిలో ఏముంటున్నాయి? శ్రమించే మనుషులా... ప్రకృతి... జీవితం... సంప్ర దాయం...

ఒక్కసారి ఫ్లాష్ వెలిగింది.

ఇప్పుడు నేను ఓ అభిప్రాయానికంటూ రాగలుగుతున్నాను. అది సమగ్రం కాకపోవచ్చు. ఈనాటి సత్యం కావచ్చు. కాక పోవచ్చు కూడా!

రవీంద్ర జైన్ చిత్రాల్లో శ్రమలేదు. శ్రమకు చెందిన విషయం ఏమీ లేకపోవడం వల్ల జీవితానికి చెందీ, శ్రమతో మెరుగులుదిద్దబడుతున్న ప్రకృతి గురించి లేకపోవడంవల్ల నన్ను ఆకర్షించలేదు. బహూశా నాకు అర్థమైన, అనుభూతిచెందిన, చిత్రాలన్నింటా శ్రమకుచెందిన ప్రపంచపు 'గుజ్జు' ఉందనుకుంటాను.

'శ్రమతో సంబంధంలేని ఏ కళారూపమైనా ఎక్కువమందిని ఆకర్షించలేదు'

అయితే నేను ఇలా చెప్పాలనుకున్నాను' శ్రమతో సంబంధంలేని ఏ కళారూపమైనా శ్రమతో సంబంధం కలవారిని ఆకర్షించలేదు.' ఇందాక చెప్పానే... ఏదో అడ్డంవస్తుందని. మరి రవీంద్రజైన్ ఆర్టును నిర్మొహమాటంగా తిరస్కరించకపోవటానికి ఓ కారణం ఉంది. అది రవీంద్ర జైన్ శ్రమతో రూపొందింది కాబట్టి!

—ఉదయం వారపత్రిక